క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

పట్నంబజారు: ప్రయాణికులనుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఈ నెల 18వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ డిపో 2 మేనేజర్ షేక్ అబ్దుల్‌సలామ్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం జరుగుతుందని తెలిపారు. గుంటూరు, తెనాలి, విజయవాడ, విశాఖపట్నం రూట్లలో తిరిగే బస్సులకు సంబంధించిన ప్రయాణికులు, విద్యార్థులు వారి సమస్యలను తెలియచేయవచ్చని తెలిపారు. 9959225421 నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

ప్రమాద కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

పట్నంబజారు: ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం రామనామక్షేత్రంకు చెందిన పసుపులేటి గణేష్ (22) అనే యువకుడు 2021 సంవత్సరంలో జేకేసీ కాలేజీ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే రోడ్డులో కారులో వెళుతున్న కంపా రంజన్ అనే వ్యక్తి అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ.. గణేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఛార్జీషీటు దాఖలు చేయగా, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో ఏపీపీ జి.వెంకటేశ్వర్లు ప్రాసిక్యూషన్ నిర్వహించగా, నేరం రుజువైంది. దీనితో ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జి.స్పందన గురువారం కంపా రంజన్‌కు రెండు సంత్సరాల జైలు శిక్ష, రూ 1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

క్యాజువల్ లీవులు అమలు చేయాలి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు క్యాజువల్ లీవులు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుమూడి మధుబాబు నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావుకు విన్నవించారు. నూతన ఎస్ఈగా విధుల్లో చేరిన నాగమల్లేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు 15 రోజుల క్యాజువల్ లీవులు అమలు చేస్తున్నారని, కానీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న 1060 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులకు క్యాజువల్ లీవులు అమలు చేయడం లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వలే ఇంజినీరింగ్ కార్మికులకు కూడా క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరారు.

వ్యక్తిపై దాడిచేసిన యువకులపై కేసు

లక్ష్మీపురం: వినాయక చవితి సమయంలో చెక్కతో స్టేజీ వేసేందుకు ఖాళీ లేదని చెప్పినందుకు సెంట్రింగ్ పని ముగించుకుని ఇంటికి వెళుతున్న వ్యక్తి పై కొందరు యువకులు బీరు సీసాతో తలపై తీవ్రంగా దాడి చేసిన ఘటన కేవీపీ కాలనీలో జరిగింది. గాయాలపాలైన బాధితుడు ఆస్పత్రిలో చికిత్సపొంది అనంతరం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావు పేటకు చెందిన పట్టంశెట్టి కోటేశ్వరరావు అనే వ్యక్తి సెంట్రింగ్ పని, చెక్కలతో స్టేజీ ఏర్పాటు చేయడం వంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే బుధవారం మధ్యాహ్నం సంపత్‌నగర్‌లోని సెంట్రింగ్ చెక్కలు ఆటోలో వేసుకుని కృష్ణబాబు కాలనీలో చక్కలు దింపి, కొండావెంకటప్పయ్య కాలనీ వైపుగా పయనం అయ్యాడు. ఆ ప్రాంతంలోని గేలక్సీ బార్ వద్ద ఆటోను నిలిపాడు. కోటేశ్వరరావును గమనించిన స్థానికంగా నివాసం ఉండే చాప, ప్రవీణ్ అనే యువకులు మరికొందరితో కలిసి మద్యం సేవించి కోటేశ్వరరావును అడ్డుకున్నారు. వినాయక చవితి సమయంలో తమ ప్రాంతంలో స్టేజీ ఏర్పాటుకు ఖాళీ లేదని చెబుతావా అంటూ చేతిలో ఉన్న బీరు సీసాతో కోటేశ్వరరావు తలపై కొట్టి గాయాలపాలు చేశారు. దీంతో బాధితుడిని స్థానికులు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చాప, ప్రవీణ్, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగిసిన వార్షిక మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీతాగ్యరాజ సాంస్కృతిక సంఘం 46వ వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముప్పవరపు సింహాచలశాస్త్రి ముత్తుస్వామి దీక్షితుల వారి చరిత్ర అనే అంశంపై నిర్వహించిన హరికథ అలరించింది. వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, మృదంగంపై అనీల్‌కుమార్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిశోర్ పాల్గొన్నారు.

ఇదేనా 'ప్రత్యేక' డ్రైవ్!

- ఈనెల 16 నుంచి నగరంలో 90 రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్
- కమిషనర్ లక్ష్యానికి అప్పుడే తూట్లు
- ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయని శానిటేషన్ సిబ్బంది
- దీంతో రోడ్ల మీద వేస్తున్న స్థానికులు
- కొండలా పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- పట్టించుకోని అధికారులు



రత్నపురి కాలనీలో రోడ్డు మీద పేరుకుపోయిన చెత్త

నెహ్రూనగర్, లక్ష్మీపురం: గుంటూరు నగరంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పేరుతో 90 రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రజారోగ్య విభాగంతో పాటు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను కూడా భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక డ్రైవ్ బుధవారం నుంచి నుంచి నగరంలో చేపట్టారు.

22 మంది ప్రత్యేక అధికారుల కేటాయింపు

ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కోసం 22 మంది ప్రత్యేక అధికారులను నగర కమిషనర్ నియమించారు. వీరంతా ఉదయం 5.30గంటలకు మస్టర్ పాయింట్ వద్దకు వెళ్లి హాజరు పట్టిక, డివిజన్‌లో చేపట్టాల్సిన పనులను పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అయితే స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో ఆశించిన స్థాయిలో ఫలితం కనపడక పోగా రోడ్ల వెంట చెత్త పేరుకుపోవడం గమనార్హం.

ఇంటింటికి చెత్త సేకరించేవారు లేరు..

గతంలో చెత్త సేకరణకు ఇంటింటికి పారిశుద్ధ్య కార్మికులు వచ్చే వారు, కాని ఈ మధ్య ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో స్థానిక ప్రజలు రోడ్లు మీద చెత్త వేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాలన్ని కూడా దుర్గంధంగా మారిపోతున్నాయి. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ఏమో కాని..ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



కృష్ణనగర్ ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద నిండినా, చెత్త తొలగించని డంపింగ్ బాక్స్

ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదు



గత కొద్ది రోజుల నుంచి ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. దీంతో చేసేదేమి లేక ఇళ్లల్లోని చెత్తను రోడ్ల మీద వేయాల్సిన పరిస్థితి వస్తుంది. అధికారులు స్పందించి ఇంటింటి చెత్త సేకరణ సజావుగా సాగేవిధంగా చూడాలి.

– రజినీ, రత్నపురి కాలనీ

రామాయణం అద్భుత గ్రంథరాజం

వాల్మీకి చిత్రపటానికి మేయర్, కమిషనర్ నివాళులు



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ కావటి, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: రామాయణం ప్రతి ఒక్కరూ చదవాల్సిన మహా గ్రంథమని, అటువంటి గ్రంథాన్ని రచించిన ఆది కవి వాల్మీకి జయంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభపరిణామని గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు అన్నారు. గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తొలుత చెడు అలవాట్లతో జీవించిన వాల్మీకి నారద మహర్షి సూచనల మేరకు మహా భక్తునిగా మారి రామాయణం వంటి మహా గ్రంథాన్ని రచించారన్నారు. ఆయన రచించిన రామాయణం న్యాయం, ధర్మం, పాపం, పుణ్యం వంటి వాటిని సూచిస్తుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ మనలోని చెడు తత్వాన్ని తొలగించుకొని సమాజ ఉన్నతికి దోహదపడడానికి ఆదికవి వాల్మీకి జీవితం అనుసరణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవి బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో...



వాల్మీకి జయంతి కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరావు, సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సంస్కృతభాషకు చెందిన మొదటి కవిగా పరిగణించబడతారని, రామాయణ ఇతిహాసాన్ని రచించడం ద్వారా ప్రసిద్ధి చెందారని పేర్కొన్నారు. ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సముచితమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు వద్దే వద్దు

పాతగుంటూరు మణిహోటల్ సెంటర్‌లో స్థానికుల ధర్నా



పాతగుంటూరులో ధర్నా నిర్వహిస్తున్న మహిళలు, స్థానికులు

నగరంపాలెం: ఇళ్ల మధ్య ఏర్పాటుచేయనున్న మద్యం దుకాణాలను వెంటనే ఎత్తివేయాలంటూ స్థానికుల పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. త్వరలో వైన్స్ షాప్ ప్రారంభం అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ఆయా దుకాణాల ఎదుట షామియానాలు వేసి నిరసనకు దిగారు. ఈ క్రమంలో యాజమానులతో స్వల్ప వాదన జరిగింది. పాతగుంటూరు మణిహోటల్ సెంటర్‌లో మూడు మద్యం దుకాణాలు ప్రారంభించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో దుకాణాల వద్ద త్వరలో వైన్స్ షాప్ ప్రారంభం అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో విషయం స్థానికులకు తెలియడంతో, వారిలో ఒక్కసారిగా ఆగ్రహం పెల్లుబికింది. పెద్ద సంఖ్యలో స్థానికులు, మహిళలు పెద్ద ఎత్తున్న చేరుకున్నారు. ఆయా మద్యం దుకాణాల వద్ద షామియానాలు వేసి నిరసనకు దిగారు. జనావాసాల మధ్య మద్యం దుకాణాలు తెరవద్దంటూ నినదించారు. ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. దగ్గర్లో దేవాలయం, మసీదు, చర్చి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. దీంతో నిత్యం రాకపోకలు చేస్తుంటారని అన్నారు. మందుబాబులు తాగి ఇక్కడే చిందులేస్తుంటారని వారు వాపోయారు. కనీసం రాకపోకలు చేయాలన్నా కష్టంగా ఉంటుందని అన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఇటువైపుగా రాకపోకలు చేస్తుంటారని తెలిపారు. రాత్రిళ్లు మరింత ఇబ్బందిగా ఉంటుందని, రాత్రి ఏడు గంటలకు బయటకు రావాలంటే వణుకు వస్తుందని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. మద్యం దుకాణాలు ఇక్కడే ఏర్పాటు చేస్తే స్థానికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిరసనలో స్థానికులు జంగాల చైతన్య, శంకరరెడ్డి, బ్రహ్మానాయుడు, రావెల వెంకటేశ్వరరావు, పాస్టర్ సీహెచ్ ప్రభుకుమార్, అల్తాఫ్, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

గ్లాసులు విసిరేత..



ఇటుగా రాకపోకలు సాగించేందుకు కష్టంగా ఉంటుంది. రోడ్డుపై అటు ఇటు తిరిగేటప్పుడు కనీసం తప్పుకోరు. తాగిన గ్లాసులు విసిరేస్తుంటారు. అర్ధరాత్రిళ్లు కేకలు వేస్తూ గొడవలు జరుగుతుంటాయి. ఒక్కొక్కసారి చాలా భయంగా ఉంటుంది.

– టి.లక్ష్మి, పాతగుంటూరు

మత్తులో ఊగిసలాట..



ఇక్కడ ఉన్న ఒక్క దుకాణం వద్దే నిత్యం మద్యం మత్తులో ఊగిసలాడుతుంటారు. కనీసం ఒంటిపై దుస్తుల్లేకుండా తిరుగుతుంటారు. అంతేగాక పిల్లలను బయటకు పంపించాలంటే భయంగా ఉంటుంది. ఒక్కొక్కసారి పాఠశాలలకు వెళ్లే పిల్లలతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు. స్థానిక మహిళల వెంటపడి గొడవ చేస్తున్నారు. గుడికి వెళ్లేందుకు బయటకు వచ్చేందుకు భయంగా ఉంటుంది.

– మాలంపాటి రమాదేవి, పాతగుంటూరు

మద్యం దుకాణాలు వద్దు..



ఇక్కడ మద్యం దుకాణాలకు దగ్గర్లో పాఠశాలలు ఉన్నాయి. ప్రతి రోజు విద్యార్థులు చదువుకునేందుకు ఈ మార్గం మీదుగా వెళ్తుంటారు. దీనికితోడు ఇక్కడ చాలా మంది మందుబాబులు తాగి తిరుగుతుంటారు. డివైడర్‌పై కూర్చుని పెద్దపెద్దగా కేకలు వేస్తుంటారు. ఒక్కొక్కసారి పిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తుంటారు. ఎవరినైనా అడిగితే వారిపై దాడులకు దిగుతుంటారు. ఇక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని కోరుతున్నాం.

– టి.పెద్దపుల్లారావు, పాతగుంటూరు

స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలి



విద్యార్థినులతో ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ సుప్రియారావు,అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమ దైనందిన జీవితంలో స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలని ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ ఓఎస్ సుప్రియారావు పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవ వారోత్సవాల్లో భాగంగా గురువారం భారత్‌పేటలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో ఆదాయపు పన్నుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుప్రియారావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్వచ్ఛతకు ప్రాధాన్యమిచ్చేవారని, అందుకే కేంద్ర ప్రభుత్వం గాంధీ జయంతి రోజునే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. స్వచ్ఛభారత్ కల సాకారం కావాలంటే సమాజంలోని ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని సూచించారు. ఆదాయపు పన్ను శాఖాధికారులు జి.అరుణ్‌కుమార్, నాగప్రసాద్, కె.రామచంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి.సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరానికి వచ్చిన సీసీఎంబీ మొబైల్ వాహనం



సీసీఎంబీ మొబైల్ వాహనం వద్ద ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కృష్ణవేణి, పద్మజ

గుంటూరు ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)కి చెందిన మొబైల్ వాహనం గురువారం నగరానికి వచ్చింది. సీసీఎంబీ సహకారంతో తిరుపతిలోని జాతీయ సైన్స్ మ్యూజియం ప్రాంతీయ కేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ వాహనాన్ని లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో విద్యార్థుల సందర్శన కోసం ఉంచారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు వాహనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మొబైల్ ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ జీన్ హెల్త్ కనెక్ట్ పేరుతో విద్యార్థుల ప్రగతి, స్వావలంబన దిశగా ఏర్పాటు చేసిన మొబైల్ వాహనం ఎంతో ఉపయోగకరమైనదని అన్నారు. జన్యుపరమైన అంశాలపై విద్యార్థులకు ప్రత్యక్ష పద్ధతిలో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, కో–ఆర్డినేటర్ దుర్గాశ్యామ్, జేవీవీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన నాయకుడు యోబు

సంస్మరణ సభలో ఏఎన్‌యూ అధికారులు, సిబ్బంది

ఏఎన్‌యూ: ఆదర్శవంతమైన ఉద్యోగ సంఘ నాయకుడు నంబూరు యోబు అని వీసీ ఆచార్య కె.గంగాధరరావు కొనియాడారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏసీఈ(అదనపు పరీక్షల నియంత్రణ అధికారి)గా విధులు నిర్వహిస్తూ ఆకస్మికంగా మృతి చెందిన డిప్యూటీ రిజిస్ట్రార్ నంబూరు యోబు సంస్మరణ సభ గురువారం యూనివర్సిటీలో జరిగింది. సభలో వీసీ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పోరాడిన పోరాటయోధుడు యోబు అన్నారు. ఏసీఈగా బాధ్యతలు స్వీకరించిన అతికొద్ది రోజుల్లోనే ఆయన మరణించడం యూనివర్సిటీకి తీరని లోటన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. ఆయన సేవలను నేటి ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ తాను యూనివర్సిటీలో పరిశోధకుడిగా ఉన్న రోజుల్లో నంబూరు యోబు ఉద్యోగిగా ఉండి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించేవారన్నారు. మాజీ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, బాబూ జగ్జీవన్‌రామ్ చైర్ డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్, మాజీ సీఈ వాసా మాణిక్యాలరావు, సీఈ ఎ.శివప్రసాదరావు, వికాస కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్ ఆర్ ప్రకాశరావు, వికాస మాజీ సెక్రటరీ ఎన్.నాగేశ్వరరావు యోబుతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. సభలో పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగితే విజయం



నెహ్రూనగర్: విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగుతూ.. చదవగలిగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాష్ట్ర జీఎస్‌టీ అడిషనల్ కమిషనర్ ఎస్ఈ కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రెడ్డి జన సేవా సమితి, రెడ్డి జనాభ్యుదయ మండలి ఆధ్వర్యంలో ఉడుముల నర్సిరెడ్డి 38వ వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వార్షిక ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సిరెడ్డి ఎంతో ఉన్నతంగా ఆలోచించి ఆనాడు రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేశారని, తాను కూడా ఇదే హాస్టల్‌లో చదివి ప్రయోజకుడిని అయ్యానని చెప్పారు. మండలి సెక్రటరీ కంది సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం 93 మందికి రూ.7.60లక్షలు అందజేయడం జరిగిందన్నారు. మండలి నాయకులు చల్లా అంజిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, వనుకూరి సూరారెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, బండి అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔషధ ధరల పెంపు దారుణం

లక్ష్మీపురం: ఉబ్బసం, తలసేమియా, క్షయతో పాటు మానసిక ఆరోగ్య రుగ్మతలతో బాధపడే వారికి అవసరమైన ఔషధాల ధరలను ఏకంగా 50 శాతం పెంచటాన్ని అవగాహన సంస్థ ఆరోగ్య సభ బృందం నిరసన తెలియజేస్తుందని సంస్థ సీనియర్ నాయకులు కొత్తమాసు మల్లికార్జునరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యానికి ఔషధ రంగాన్ని వదిలి వేయటాన్ని నిరసిస్తూ సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధాల ధరల సైతం చుక్కలు దాటి పరుగులు తీస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయన్నారు. యోగాచార్యులు ఎ.ఇందుశేఖర్‌లు మాట్లాడారు.

నగరంలో ఈవ్‌టీజర్ల హల్‌చల్

- ప్రైవేటు జూనియర్ కళాశాలల రోడ్లలో బైక్‌లపై ప్రదక్షిణలు
- నంబర్ ప్లేట్లు, సైలెన్సర్లు తొలగించి, త్రిపుల్ రైడింగ్
- కళాశాలలు వదిలే సమయానికి తిష్టవేస్తున్న ఆకతాయిలు
- ఓ సంఘటనలో తల్లిదండ్రులతో ఘర్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల వద్ద ఈవ్ టీజర్ల బెడద ఎక్కువవుతోంది. ప్రతి రోజూ సాయంత్రం కళాశాలలు వదిలే సమయానికి ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్లు, సైలెన్సర్లు తొలగించి భారీ శబ్దాలు చేస్తూ వస్తున్న ఆకతాయిలు విద్యార్థినులను ఇబ్బందులు గురి చేస్తున్నారు. లక్ష్మీపురం, కొరిటెపాడు మెయిన్‌రోడ్డు, చంద్రమౌళీనగర్ ప్రాంతాల్లోని శ్రీచైతన్య, భాష్యం, అభ్యుదయ, ఆర్క వంటి పలు ప్రైవేటు జూనియర్ కళాశాలలను ప్రతి రోజూ సాయంత్రం 7 గంటలకు వదులుతుంటారు. కళాశాలలు వదిలిన తరువాత పిల్లలను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు వేచి ఉంటున్నారు. దీంతో పాటు ఆటోల్లో ఇళ్లకు వెళ్లే విద్యార్థుల కోసం ఆటో డ్రైవర్లు కళాశాలల వద్ద ఉంటున్నారు. ఇదే సమయంలో ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. బైక్‌లపై త్రిబుల్ రైడింగ్‌తో ఒక్కసారిగా యువకులు కళాశాలల రోడ్డులోకి వచ్చి, కళాశాలల నుంచి బయటకు వస్తున్న విద్యార్థినులను చూసి అరవడం, కేకలు వేయడం వంటివి చేస్తూ వెళ్లిపోతున్నారు. నిత్యం ఆకతాయిలు దాదాపు 10 బైక్‌లపై ఆయా ప్రాంతాల్లోని కళాశాలలు ఉన్న రోడ్లలో చక్కర్లు కొడుతున్నారు. వీరి ఆగడాలతో విసిగిపోతున్న తల్లిదండ్రులు ఆకతాయిలపై ఫిర్యాదు చేద్దామన్నా, వారి బైక్‌ల నంబర్లు నోట్ చేద్దామనుకున్నా ముందుగానే నంబరు ప్లేట్లు తొలగించుకుని వస్తుండటంతో అది సాధ్యపడటం లేదు.

తల్లిదండ్రులతో ఘర్షణ..

తాజాగా గురువారం లక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల వద్ద బైక్‌లపై తిరుగుతున్న ఆకతాయిలను నిలువరించిన తల్లిదండ్రులు వారితో వాగ్వాదానికి దిగారు. తల్లిదండ్రులతో ఘర్షణకు దిగిన ఆకతాయిలు బైక్‌లపై అక్కడి నుంచి జారుకున్నారు. ప్రతి రోజూ కళాశాలలు వదిలే సమయంలో బైక్‌లపై తిరుగుతూ విద్యార్థినులను ఈవ్ టీజింగ్ చేస్తున్న ఆకతాయిలపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.